ఉగాది మినీకథల పోటీలో కన్సొలేషన్ బహుమతి రు. 75/- పొందిన కథ




## జీవిత విశేషాలు

పుట్టింది ఆంధ్రలో. పెరిగింది బెంగాల్‌లో అభిరుచులు స్నేహాన్ని యిష్టపడడం. మంచి కథలు చదవడం. నృత్యం చెయ్యడం. కేరమ్స్. బేట్‌మింటన్ ఆడడం అంతే. ఫొటో లేకపోయినందున పంపలేకపోతున్నాను.

— దాట్ల కమల

ఈ దేశంలో సగటు మనుషులు, విలువలేని క్రిముల్లాంటి వాళ్ళు, ఎలాంటి ప్రదేశాల్లో ఎలాంటి జీవితాన్ని జీవిస్తున్నారో అలాంటి ప్రదేశంలో, సంఘంలో హోదాకి, అంతస్తుకి, దర్పాలకు, దర్జాలకు, అలవాటుపడ్డ మనలాంటి మనుషులనబడే వాళ్ళు ఎప్పుడూ చూడలేని, తటస్థించని తావులో అలాంటి మురికి మురికి ప్రదేశంలో ఆ రాత్రి_

ఆ రాత్రి నిజంగా, మీకూ నాకూ, డబ్బుని కాగితాలా విసిరివేయ గలిగే సంపాదన విలువ తెలీని ఖర్చుపరులకు, ఖుషీదారులకు అందమైన రాత్రిలా వుండేరాత్రి —

ఆ రాత్రి ఖరీదైన ఫైవ్ స్టార్ హోటల్స్ దగ్గర్నించి, మామూలు లాడ్జింగ్ హౌస్‌ల వరకూ ఆడవాళ్ళతో వాళ్ళ అందాల్తో విందులు చేసుకునే మగ వాళ్ళను వాళ్ళ డబ్బును ఖర్చు పెట్టించే ఆ రాత్రి—

ఆ తల్లి—

ముగ్గురి పిల్లల్నీ చూస్తోంది. ఆ చూపులో కన్నప్రేమ, ఇన్నాళ్ళూ పెంచిన అమృతంలాంటి అభిమానం, కొండంత సంతోషం వున్నాయి. కానీ వాటినన్నిటినీ తోసివేసే చీకటిలాంటి దుఃఖం. బ్రతుకు మీద అసహ్యం ఇంకో ప్రక్క. ఇంకో ప్రక్క ఈ రెంటిమధ్య వున్న ఆ తల్లి ఎలావుందో నేను వర్ణించి చెప్పలేను.

ఒకనాడు గొప్ప సంస్కృతిని పోషించిన ఈ భారతంలో ఈనాడు అడుగడుగునా ఏ రోడ్డు ప్రక్క చూసినా కనబడే 'ముష్టి తల్లు'ల్లో ఓ తల్లిలా వుంది.

ఆ ముష్టితల్లి నిజంగా ఓనాడు కలలన్నిటినీ అందంగా పేర్చుకుని వాటిమీద కూర్చోడానికి సాహసించిందే. కానీ ఆ కలలన్నీ కాలిపోతాయని, ఇలా ఈనాడు మురికిలో బురదలో పందుల్లా బ్రతకాల్సివస్తుందని వూహించని ఆనాటి ఆ కన్నెపిల్ల ఈనాడు ముగ్గురు పిల్లల తల్లి.

ఆ గుడిసెలో ఓమూల ఓ నులకమంచం వుంది. ఆ మంచమ్మీద ఎలకపిల్లల్లా ఇద్దరు పిల్లలు పడుకున్నారు. వాళ్ళు అప్పటివరకూ ఏడుస్తూ అప్పుడే నిద్రపోయి వుండొచ్చు. ఆకలితో ఏడ్చి సొమ్మసిల్లిపోయిన వాళ్ళ మసిబొగ్గుల్లాంటి బుగ్గలమీద కన్నీటి చారికలు చీకట్లో కలిసిపోయాయి.

ఇంకో పిల్ల పెద్దది.

దానికి పదమూడేళ్ళ వయసుంటుంది. ఆ అమ్మాయికూడా తల్లి వళ్ళో ఆకల్తో సొమ్మసిల్లిపోయి నిద్రపోతోంది. కానీ ఆ అమ్మాయి గుండెలమీద కప్పుకోడానికి గుడ్డల్లేని కారణాన, తల్లి చిరిగిన చెంగు ఆ పిల్ల గుండెమీద కప్పింది.

ఆ తల్లి ఏడుస్తోంది. ఆ తల్లి కళ్ళు నుంచి పైకి వస్తున్న కన్నీళ్ళు చెక్కిలి మీదనుంచి కారి అస్తవ్యస్తంగావున్న జాకెట్టు మీదపడి అక్కణ్ణించి, చంటోడు తాగిన చనుబాలకు గుర్తులుగా మరకల మీద పడుతున్నాయి.

ఆ సమయంలో ఆ తల్లికి చచ్చిపోవా[illegible]నుంది. చచ్చిపోవడం బ్రహ్మవిద్యకాదు- రోడ్డుమీదకొచ్చి నిలబడితే, రోడ్డుమీద యెవరున్నారో లేరో అక్కర్లేని లారీ డ్రైవర్లు తలచుకుంటేచాలు హాయిగా ఆమె ప్రాణాలు పోతాయి. ఎక్కడఆగుతాయో, ఎక్కడ సాగుతాయో తెలీని ఏ సిటీబస్సు వచ్చే దార్లో నిలబడినా చాలు ఆమె కోరి

పోవచ్చు. లేకపోతే ఏ రైలెక్కినా చాలు. టిక్కెట్టు తీసినా తియ్యకపోయినా పేద దాన్ని గురించి ఎవరూ పట్టించుకోరు. కాబట్టి పోలీసులు బైటకు తోసేస్తారు. అప్పుడామె ప్లాట్‌ఫారమ్మీద కాకుండా పట్టాల క్రింద పడొచ్చు. ఇలా చనిపోడానికి సవాలక్షమార్గాలు వున్నందున ఆ తల్లి చచ్చిపోవడం పెద్ద ప్రశ్నేం కాదు.

కానీ చావుకి మార్గం తెలీక ఆ తల్లి చచ్చిపోవడం లేదు. మరి దేనికి? బ్రతుకు మీద తీపి చావక కాదు. పిల్లలమీద ప్రేమ చావక. కానీ తనకి, తన పిల్లలకు అందమైన బ్రతుకును వూహించుకున్న ఆ తల్లి కళ్ళల్లో ఈ సమయంలో భర్త అనబడే వ్యక్తి గుర్తుకు వచ్చాడు.

భర్త—

అప్పుడెప్పుడో వాడు రిక్షాతొక్కేవాడు. దానిమీదవచ్చే డబ్బుల్తో పూరాగా తాగేవోడు. ఆ తర్వాత ఇంటికొచ్చి పెళ్ళాన్ని తన్నేవాడు— అంతే. అలా పది సంవత్సరాలు గడిచాయి. నిద్రలో వచ్చే అందమైన కలల్లా పిల్లలు పుట్టుకొచ్చారు.

ఆ తర్వాత వాడు రిక్షా తొక్కడం మానేశాడు. దానిక్కారణం ఓ చెయ్యి పోవడం. పేద ప్రజల ఓట్లుతప్ప, వాళ్ళ బ్రతుకులు అక్కర్లేని రాజకీయ నాయకుడి ఎలక్షన్ల వూరేగింపులో జరిగిన ప్రతిపక్షాల దెబ్బలాటలో నష్టపడినవాడు మనవాడు. వాడికి జరిగిన నష్టం ఎవరిక్కావాలి. రెండు సానుభూతి మాటలు, రెండు సారా సీసాలు- అంతే.

ఆ తర్వాత వాడి జీవితం నడివీధిలో విరిగిపోయిన గాంధీ బొమ్మలా అయిపోయింది. అవిటివాడు ఏం చెయ్యగలడు. ఏదైనా చెయ్యడానికి సాహసించినా ఎండమావుల్లాంటి ఉద్యోగ పథకాలు తప్ప ఏం వున్నాయి? అంచేత వాడి జీవితం పుచ్చిపోయిన కర్రలా అయిపోయింది.

ఎలాగోలాగ బ్రతకడం వాడు తెల్సుకున్నాడు. అన్నిటిలోకి సులభంగా అనిపించింది అమ్మాయిల్ని తార్చడం. వాడి కా పని చెయ్యటం తప్పుకాదు. ముందుచూపు లేకుండా కన్న తలిదండ్రుల కడుపున పుట్టిన అమ్మాయిలకు సరైన వయసులో జరగని ముచ్చట్లను కనీసం వయసుకోసం తీర్చుకునే అమ్మాయిలకు ఆ పని తప్పు కాదు. అంచేత వీడికి వాళ్ళను కాలేజీ అబ్బాయిలకు తార్చడం తప్పుకాదు.

భర్తలు ఆఫీసు పనులమీద పై ఊరెళ్ళినప్పుడు, వళ్ళు కొవ్వెక్కి రోడ్డెక్కిన పతివ్రతలకు, రోమియోల దగ్గరకు వెళ్ళడం వాళ్ళకు తప్పుకాదు. ఫాషన్. అది వీడికీ తప్పుకాదు.

అంచేత వీడు ఆ వచ్చే కమీషన్తో బ్రతుకుతున్నాడు. కానీ నిన్నరాత్రి ఇదే సమయం. గుడిసెకెవణ్ణో తీసుకొచ్చాడు వాడు. వచ్చి చెప్పాడు.

“చూడే.... ఇయ్యాల్టినించీ మనం దర్జాగా బతికేత్తామే.... కానీ నువ్వు 'వూఁ' అనాల.... ఈ....బాబు.... ఈ బాబుకి కురపాం మార్కెట్టుకాడ బంగారం కొట్టున్నాది.... నువ్వుగనక 'వూఁ' అంటే ఇయ్యాల్టినించి నువ్వు బంగారం.... నీ



కృష్ణకుమారి
ప్రమోదకరమైన
ప్రయోజనాత్మక నవల
సూపర్ స్టార్
వివరాలుత్వరలో...

గల్ఫ్ దేశాలలో ఉద్యోగం

మధ్య ప్రాచ్య దేశాలలో నేరుగా ఉద్యోగం పొందుటకు ఉచిత సాహిత్యం మరియు పూర్తి వివరాల కోసం స్వంత చిరునామాగల స్టాంపులు అంటించిన కవరుతో దిగువ చిరునామాకు వ్రాయండి.

Globe Service Information Centre (Regd.) (A-4)
WZ-69, Nangli Jalib
New Delhi-110058.

తెలుగు పుస్తకాలు

కాశీరామేశ్వర మజిలీ కథలు రు. 15/-
గృహ వైద్యదీపిక 280 రోగాలకి రు. 10/-
కొక్కోకము (కామసూత్రాలు) రు. 10/-
అనుభవవైద్యం అన్నిరోగాలకి రు. 20/-
వర్తక మర్మాలు (చిన్న పరిశ్రమలు) రు. 15/-
టైలరింగ్ బుక్ (బొమ్మలతో) రు. 15/-
4 పుస్తకములకు పోస్టేజి ఉచితం.

ఉషా బుక్ సెంటర్,
గాంధీనగర్. తాడేపల్లిగూడెం-1 (A.P.)

మెడికల్, ఇంజనీరింగ్
ఎంట్రన్స్ పరీక్షల శిక్షణ

సీట్లకు ముందుగా రిజర్వు చేసుకోవచ్చు! హాస్టలు వసతికూడా కలదు. ఏప్రియల్ చివర వరకు గడువు. వివరాలకు వెంటనే ఒక కార్డు వ్రాయండి.

శాంతా కాలేజి.
బ్రాడీపేట, గుంటూరు.

పి. శ్రీమన్నారాయణ
ప్రిన్సిపాల్.

కూతురు బంగారం.... నాను బంగారం.."

"ఏటంటన్నావు...."

"అదేనే.. బైట కంపెనీల్లో గుంటలెవరూ లేరే.. రెయిదని.. కొత్త డియస్పీ మంచోడు కాదని.. పూరు దాసేశారు.... ఈడికి గుంట కావాల్ట.. ఎంత డబ్బు కావలిస్తే అంతిస్తాట్ట.. ఇదిగో రెండొందలు.. రేపియ్యాలకి దాన్ని తయారు చెయ్యి.."

అప్పుడు చూసింది తను కూతురు వైపు. నిండా పసితనం పోని వయసు. ఆరోగ్యంగా పెరిగిన శరీరం.

వద్దంది. చచ్చిపోతానంది. చంపెయ్యామంది. తాగుడు నిషాలో తన్ని వెళ్ళిపోయాడు. ఇప్పుడో, మరో సమయంలోనో వస్తాడు. తప్పదు. తన బ్రతుకు కాలిపోయింది. కలలు చెరిగిపోయాయి. కానీ తన పిల్లలు.. కొడుకులు..కూతురు..

అప్పుడెప్పుడో లక్ష్మిటాకీసుసందు గుడిసెల్లో పది రూపాయల కోసం బ్రతుకును నడివీధిలోపెట్టి, పడుపు వృత్తిలో బ్రతికి, చివరకు జబ్బుల్తో రోడ్డు ప్రక్కకు నెట్టబడి కుళ్ళి కుళ్ళి చచ్చిపోయిన దానిలా తన కూతురు కాకూడదు.

తన ఇద్దరు కొడుకులు - అక్కవళ్ళమ్ముకునేదైతే తమ్ముళ్ళు బ్రోకర్లు, రౌడీలు, మోసగాళ్ళు, కేడీలు యెవరైనా ఔతారు.

కానీ తను కన్నందుకు వాళ్ళని కనీసం పెంచలేదు. వాళ్ళమట్టుకు వాళ్ళు పెరిగి చీకటికి అలవాటుపడి చీకటి బ్రతుకులు బ్రతుకుతారు. అంచేత తన పిల్లలు అలా కాకూడదు. తను చచ్చిపోతే వాళ్ళు అలాగే ఔతారు. ఇలాగ కాకపోతే యింకోలాగైనా యిదే బ్రతుకులో యిలాగే బ్రతుకుతారు. అంచేత.

* * *

ఆ తల్లి అలా ఎంతసేపు ఆలోచించిందో తెలీదు. రాత్రి చాలా గడిచినట్టుగా వుంది. దూరంగా వున్న బార్ కమ్ రెస్టారెంటు లోంచి చిన్నపిల్లల్లా అడుగులేసుకుంటూ వస్తున్న పెద్దమనుషులు గబగబా కార్లెక్కిపోతున్నారు.

ఏ కిళ్ళీబడ్డీ వెనకో ఏ 'టీ' కోసమో కక్కుర్తిపడి పడుపు పనికి సిద్ధమయ్యే బజారు ముష్టిదాని దగ్గర మామూలు వసూలు చెయ్యడానికా అన్నట్టు గబగబా తిరుగుతున్నారు రక్షక భటులు.

రాత్రి మామూలుగానే వుంది. యూనివర్సిటీ రూముల్లోకి అమ్మాయిలు బాత్రూమ్ కిటికీలగుండా వెళ్తూ వస్తూనే వున్నారు. బ్రాందీ, విస్కీలు నాలుగు పాదాల్తో నడుస్తూవున్నాయి.

అన్నీ సజావుగానే చిక్కగానే చీకటి

### "కన్నీళ్ళు"

మండుతున్న ఎండలకి
ఎండుతున్న గొంతులకి
తడుపుకోవాలన్నా దొరకవు
నీరుకాదు మొసలి కన్నీరైనా

—ఎన్. రాజేశ్వరి

పద్ధతుల్లో సాగిపోతున్నాయి. కానీ ఆ తల్లి గుండెల్లో మాత్రం నీకూ, నాకూ, ఆ పోలీసు వాడికి, పేదల గురించి ఘోషను కోసం కవిత్వం వ్రాసే ఏ విప్లవ, అభ్యుదయ కలానికీ అందని దుఃఖం చిక్కగా వుంది.

ఒక్కసారి ఆతల్లి కూర్చున్న చోటు నుంచి లేచి, ఆ పక్కనే పెంటకుప్ప దగ్గర పడివున్న రెండు ఖాళీ సీసాల్ని తీసుకుని, రాతితో మెత్తగా నూరి, సిల్వరు గ్లాసులోవున్న నీళ్ళలో ఆ గుండని కలిపి ఇద్దరు కొడుకులకు, ఆ తర్వాత తన కూతురిచేతా తాగించింది. తర్వాత తనూ తాగింది.

అది జరిగిన గంట తర్వాత—

ఆమె పెనిమిటి వచ్చాడు. వాడి వెనకాతల డబ్బు, కొవ్వు పుష్కలంగా వున్న ఆ బంగారం కొట్టు కుర్రాడూ వచ్చాడు.

"ఒసే.... అదేదీ...." ఆ పిలుపుకి మలిపలుకు లేదు.

"తొంగుండిపోనాది గావాల.... మీరెల్లండి బాబూ...." వాడే మళ్ళీ అన్నాడు.

ఆ బంగారం కొట్టు కుర్రాడు లోనికెళ్ళాడు.

లోన గుడిసెలో చీకటి. వాడి జేబులో డబ్బులాగానే వాడి కళ్ళల్లో కామంలాగానే వుంది.

బైట దూరంగావున్న వీధిలైటు కాంతి పడి మసక మసకగా, గుమ్మందగ్గరే పడుకున్న ఆ పదమూడేళ్ళ పిల్ల గుడ్డల్లేని గుండెలమీద తన చేతులువేసి పడుకున్న తల్లిని చూశాడు. తల్లిని ముట్టుకోవాలా! పిల్లను ముట్టుకోవాలా? సంశయంగా, మెల్లగా తాకాడు. వాడు ముట్టుకున్న ఆ శరీరం మెత్తగా, చల్లగా వుంది. అంత వరకూ వాడి కళ్ళల్లోవున్న కామం జరజరా దిగిపోయి, దాని స్థానంలో భయం చోటు చేసుకుంది.

●